# లక్షలు.

ర. వేణుగోపాలరావు




✸ వడపళని బస్సుస్టాండు దగ్గర నిల బడ్డాను. మింట్ పోవాలి నేను. మింట్ పోవాలంటే ముప్ఫయ్యేడో నెంబరు బస్సె క్కాలి. బస్సెక్కాలంటే—అందులోనూ తమిళ్నాడ్ స్టేట్ ట్రాన్సుపోర్టు బస్సె క్కాలంటే— మినీ యుద్ధం చెయ్యాలన్న మాట. అయినా తప్పేదేముంది? మినీ యుద్ధమే కాదు మాక్సి యుద్ధమైనా చేసి ఇవాళ ముప్ఫయ్యేడు యెక్కి ముప్ఫయ్ మూడు మలుపులు తిరిగి—వూరికా కొన నున్న మింటుకి వెళ్ళితీరాలి నేను.

అక్కడ బ్రహ్మంగారు నా కోసం ఎదురు చూస్తుంటారు. ఈ పాటికే ఆయన రెండు రవుండ్లేసుకుని హీటెక్కి పోతూ వుండి వుంటాడు, రెస్ట్లెస్గా, అనీజీగా ఈజీఛెయిర్లో కూర్చొని, నన్ను తిట్టుకుంటూ వుండివుంటాడు. ఆయన కేం మహానుభావుడు? ఏమైనా చెయ్య గలడు. రెండు రవుండ్లేసుకుని హీటెక్కి పోవడం ఎవరేనా చెయ్యగలరు...కాని నా కోసం ఎవరాలోచిస్తారు, బ్రహ్మంగారు తప్ప!

రేపాదివారం మేం చెయ్యవలసిన ముఖ్య మయిన పనొకటుంది. అదిగాని, మేం అనుకున్నట్టుగా నెరవేరితే—వెధవబస్సుల్ని మళ్ళీ ఈ జన్మలో యెక్కుతానా?

చిన్న స్కూటర్ కొనుక్కోవాలి. ఏడు టెర్లిన్ సూట్లు ఖరీదు చెయ్యాలి... రోజుకో డ్రెస్సు వేసుకోవచ్చు. ఫ్రెండ్స్తో 'నెపోలియన్ బోనపార్టే'లా దర్జాగా మాటాడొచ్చు... బ్రహ్మంగారు ఈపాటికి ఇవేళ్టి పేపరు చూసివుంటారా?, ఏమేం సెలెక్ట్ చేశాడో! అంతా లక్... స్టార్స్ కరుణించాలి ... స్టార్ తిరగాలి ... దెబ్బకి లక్షలు ... కాకపోతే అరలక్ష...అధమపక్షం పదివేలేనా రాకపోతాయా? జేబులో చెయ్యి పెట్టి సిగరెట్ పేక్ తీశాను. ఒకే సిగ రెట్టుంది. దాన్ని పెదిమల మధ్య బిగించి ఖాళీ పేకెట్టు పారేశాను. అగ్గిపుల్ల గీసి గట్టిగా దమ్ము లాగేను. వూపిరితిత్తుల్లో కాస్త వెచ్చదనం చేరుకుంది. మెదడు కొంచెం వాడిగా, వుత్సాహంగా పనిచెయ్య సాగింది.

తప్పదు. విజయం తప్పదు. లక్ష రూపాయలు రాకా తప్పదు. ఈసారి

అదృష్టం నన్ను వరించి తీర్తుంది. ఏ అదృశ్యశక్తో నా చెవుల్లో దూరి పదే పదే ఘోష పెడ్తోంది. వారఫలాల్లో 'ఆకస్మిక ధనలాభం' అని వుంది. అదృష్టం వరించి తీర్తుందనడానికి వేరే దృష్టాంతం యింకేం కావాలి?

సిగరెట్టు దమ్ము మరోసారి గట్టిగా లాగి, రోడ్డువేపు యూదాలావంగా చూశాను. రథంలాంటి పొడవైన ఎరుపు రంగు ఇంపాలా కారొకటి పోతూంది స్పీడుగా! నేను కసిగా నవ్వుకున్నాను. 'వుండ్రా బాబూ, నేనూ కొంటాను నీ కారు బాబులాంటి కార్ని!' అనుకున్నాను.

ముప్పయ్యేడో నెంబరు విగ్రదెయ్యం కోసం చుట్టూ చూశాను. పది పదిహేను విగ్రదెయ్యాలున్నాయక్కడ...గాని ముప్ప య్యేడో నెంబరుదిలేదు. డామ్ఇట్!

జీవితంలో అదృష్ట దేవత ఒకే ఒక్కసారి వరిస్తుందని అంటారు. గత పదేళ్ళుగా ఆ మహాతల్లి కటాక్ష వీక్షణంకోసం తలుపులు బార్లా తెరిచివుంచేను. అనుక్షణం ఆమె చల్లని చూపుకోసం తహతహలాడేను... ఇహ మరి ఫర్వాలేదు. రాశిఫలాలు బాగున్నాయి. గ్రహాలన్నీ అనువైన ప్రదేశాల్లో వున్నాయి. నక్షత్రబలం కూడా అనుకూలంగానేవుంది. మరింకేం కావాలి? కనీసం ఫిఫ్టీరుపీనన్నాకావాలి...ప్రస్తుతానికి జేబులో ఫిఫ్టీ కాపర్సేవున్నాయి. ఆ ఫిఫ్టీలోని ఓ నలభై అయిదు కాపర్సు బస్సువాడు తొక్కుంటాడు. మింట్ వెళ్ళేక బ్రహ్మం గారి బుర్రమీద చెయ్యివెయ్యాలి... ఒకవేళ ఆయన దగ్గరకూడా రుపీసూ కాపర్సూ లేకపోతే — ఫర్వాలేదు ఇద్దరమూ కలిసి తాయింటుగా మరోడి బుర్రమీద చెయ్యి వెయ్యవచ్చు. ఫిఫ్టీ రుపీసంటే ఫైవ్ థౌజండ్ కాపర్సేగాని, ఫిఫ్టీథౌజండ్ లేక్స్ కాదుగదా! ఫర్వాలేదు దొరకొచ్చు. గాభరా పడక్కర్లేదు. అనుకున్నపని ఆదివారం నాడు అవలీలగా అయితీర్తుంది.

అయిన వెంటనే—'మహారాజా'లో డైన్ విత్ డాన్స్ చెయ్యాలి. 'సవేరా' అయితేనే బాగుంటుందేమో! 'మధూ' పాడ్తుంది. 'పటీనా' ఆడ్తుంది. ఆడదమంటే ఇలా అలా నా? కాదు. కాదు. హైస్పీడ్ 'హిప్ స్వేయింగ్స్'. లేదా— 'ఇంపీరియల్' కేనా పోవచ్చు; 'రఫీ' 'సలోమీ'లు ఇద్దరూ వుంటారు. స్పెక్టా క్యులర్‌గా వుంటుంది. సెన్సేషనల్‌గానూ వుంటుంది. డాన్సుచూస్తూ—జానీవాకర్‌తో డైన్‌చేస్తే—ఏం మజాగా వుంటుంది?

'హల్లో పాపారావ్ ఎక్కడికీ ప్రయాణం?'

అదృష్టదేవత కన్నుల్లో అనంతాంబరపు నీలినీడలు చూస్తున్న నాకు ఎవరో కాళ్ళుపట్టి లాగినట్టూ—పిలకపట్సి వూపినట్టూ అయింది. శుభం పలకరా మంకెన్నా అంటే పెళ్ళికూతురు ముండేది—అన్నాట్ట వెనకటికో దౌర్భాగ్యుడు. నేనేదో లక్షణంగా బయల్దేరి లక్షలు కొట్టుకొద్దామని ప్లానేస్తూంటే— 'ఎక్కడికి' అని అడగనే అడిగాడు—ఈ మహానుభావుడు. ఇహ, వనయినట్టే!

అడిగింది ఎవరో కాదు, నా కొలీగ్ నానారావు. 'ఏం లేదు. అలా...' అనేసి, మిగతాది విషంలా మింగేసి, వో నవ్వు లాంటి యేడ్పు ముఖం మీదికి తెచ్చుకు న్నాను...అంతటితో వదిలేస్తేనా? 'కోడంబాకం ఎక్జిబిషన్ చూసేరా?' అనడిగేడు.

'ఏ ముందక్కడ చూడ్డానికి, లబోడ శంఖం?'

'హిహిహి...డాన్సులున్నాయి గదుటోయ్!'

వెధవ ముఖానికి ఆ వెధవ డాన్సులు తప్పితే, ఇంకేం తెలుసు? హైదరాబాద్‌లో, బోంబేలో కాబరేలు ఎప్పుడన్నా చూసిన ముఖమా యిది? డర్టీ ఫేస్యూ—వీడూను!

'నువ్వెక్కడికేనా?' అన్నాను అంతటితో నయినా వొదుల్తాడేమోనని. ఊహూఁ వదలడే!

'హిహిహి...' అని కోడి అరిచినట్లు నవ్వి— ఫైవ్ రుపీసుంటే ఇస్తావూ?' అన్నాడు వాడి తాతగారి ముల్లేదో నాదగ్గర దాచబెట్టినట్లు!

'సోమవారంనాడు ఇప్పించు బ్రదర్' అన్నాను.

'ఇప్పట్లేవా, పోనీ వన్ రుపీ?'

'ఫిఫ్టీ కాపర్సున్నాయి. బస్సుకి......'

'వోకే బ్రదర్...సీయూ' అని అరువు తెచ్చుకున్న హుందాతనంతో అష్టవంకర్లు తిరిగిపోతూ పోతేడు. 'అమ్మయ్య' అని పీడ విరగడైనట్లు నిట్టూర్చేను. నేనేదో కమ్మని కలలు కంటూంటే—నా కలల గాలి మేడని పునాదుల్తో సహా కదిపేశాడు ద్రోహ్మడు. ఇప్పుడు మళ్ళీ ఆ మధురోహల నన్నిటినీ పేర్చుకోవాలంటే ఎంత శ్రమపడాలి, నేను?'

ఆదివారం సాయంత్రం బ్రీఫ్‌కేసులో నోట్ల కట్టల్ని పేర్చుకుని 'ఇంపీరియల్'కి టాక్సీలో పోవాలి. ప్రస్తుతానికి టాక్సీయే గతి! తర్వాత ప్లిమత్‌గాని ఇంపాలాగాని కొనెయ్యాలి.

ఛార్మింగ్ రిప్పీ పాడుతూవుంటే—విన్సమ్ రాఫీ ఆడుతూవుంటే — కోడి ముక్కల్తో జీడిపలుకుల్తో కడుపు నిండుతూవుంటే అదేనయ్యా బాబూ, అదే స్వర్గం! అనక ఏ రెండుకో కొంపకి చేరుకోవాలి.

నా ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి ఆదివారంనాడు లక్షలు చేతిలో పడ్డమూ, డాన్సింగూ, డైనింగూ చేయడమూ...తప్పనిసరిగా జరిగి తీరుతాయి— అనేది పదే పదే నా అంతరాత్మ చెప్తోంది. సిగరెట్టు కొనవరకూ కాలి, వేళ్ళు చురుక్కుమన్నాయి. పారేశాను, ఇంతలో బడబడలాడ్తూ ముప్పయ్యేడో నెంబరు బస్సొచ్చింది. ఇలా ఆగిందో లేదో— బిలబిలలాడ్తూ ఆడా మగా పిల్లా మేకా వెరసి ఓ యాభై మంది జనం బస్సెక్కేరు. నేనూ హడావుడిగా బస్సెక్కేను కిటికీ పక్క సీట్లో ఒకతను కూర్చొని వున్నాడు. అతని పక్కసీటు తప్ప మరేదీ ఖాళీగాలేదు. గబుక్కున కూర్చున్నాను. చూస్తుండగానే నిమిషాలమీద — కూర్చున్న వాళ్ళతోనూ, నిలబడ్డవాళ్ళతోనూ బస్సు నిండిపోయింది. అంత శీతాకాలంలోనూ బస్సులోవున్న నాకు పుక్కపోత సాగింది.

బస్సు వడపళని స్టాండు నుంచి బయలుదేరడానికింకా పావుగంట టైముంది. డ్రయివర్ బీడీ తాగుతూ, కండక్టర్ సిగరెట్టు పీలుస్తూ మరియూ వెత్తలపాక్ నములుతూ అల్లంత దూరంలో నిలబడి వున్నారు...నా కళ్ళ ముందు లక్షలు కదులుతున్నాయి. రూపాయి కాగితాల కమ్మని గరగరలు, చిల్లర శ్రీ మహాలక్ష్మి చిందులు...వీనుల విందుగా వినిపిస్తున్నాయి.

నా ముందు సీట్లో ఇద్దరు నవదంపతులు కూర్చొని వున్నారు. ఊరికే తల

కాయలు రెండూ దగ్గరగా పెట్టేసుకుని వూ ఒకటే మాట్లాడేసుకుంటున్నారు, రహస్యంగా! నా పక్కనే ఎవడో కూర్చుని వున్నాడు. వాడికి దాదాపు నలభై యేళ్ళుంటాయి. గళ్ళలుంగీ కట్టేడు. బనీను వేసుకుని వున్నాడు. మెలి తిరిగిన మీసాలున్నాయి. కళ్ళేమో చింతనిప్పుల్లా ఎరుపెక్కి వున్నాయి. వాడు నోరు తెరిచినప్పుడల్లా చవకబారు సారాయి వాసన గుప్పుమంటూంది. ఎవడో నాటు రౌడీయో, గుర్రబ్బండివాడో అయివుంటాడు. నా ఖర్మకాకపోతే—ఈరోజు వాడి ప్రక్కని నేను కూర్చోవడం! సరదాకి బస్సెక్కిన ఫోర్డు దొరగారి దత్తపుత్రుడిలా డిగ్నిఫైడ్‌గా కూర్చోడానికి ప్రయత్నించేను, సీరియస్‌గా చిన్న దగ్గు దగ్గి నేను చాలా హైప్లేన్ లోని వాణ్ణని వాడికి తెలియబరచేను. గళ్ళలుంగీవాడు నావేపు ఓసారి చూసి—మళ్ళీ ముఖం అటు తిప్పుకున్నాడు. వెధవ టెక్కూ పీడానూ! అసలీ బస్సులెక్కడం అంత బుద్ధితక్కువ పని మరొకటి లేదు. ఎక్కడ లేని అలగా జనమూ యిక్కడే వుంటారు.

ప్యాంటు కుడిజేబులో కాపర్సూ, ఎడం వేపు జేబులో రెండు లెటర్సూ వున్నాయి. ఆ రెండు లెటర్సూ ఇవాళే వచ్చేయి. ఒకటి మా మావయ్య కూతురు రాసింది. రెండోది మా తమ్ముడు రాసేడు. జేబులో చెయ్యి పెట్టి రెండుత్తరాలూ తీశాను. మొదట — మా మావయ్య కూతురు రాసిన వుత్తరం మడత విప్పి మళ్ళీ మరోసారి చదవడం ప్రారంభించేను.

'బావా,

నేను నీకు గుర్తున్నానా? నేనింకా ఓణీలూ గట్రా వెయ్యనప్పుడూ, నాకు పదేళ్ళే వయసున్నప్పుడూ నన్ను చూశావు. నా వుత్తరం చూస్తే బహుశః నీకింకా ఆ రూపమే గుర్తుకి వస్తుందేమో! నిన్ను చూసి యిప్పటికి పదిహేనేళ్ళు గడిచిపోయాయి. నాకిప్పుడు పాతికేళ్ళు. నాన్న సంగతి తెలుసుగా...రోజూ ఆ దిక్కుమాలిన సారా తాగి, ఇంటికి ఏ అర్ధరాత్రో వస్తున్నాడు అమ్మ పరేసరి. తాటి చెట్లలా యెదిగిన ముగ్గురు కూతుళ్ళనీ చూసి మతిపోగొట్టుకుంది. ఈ లోకం ధ్యాసే వుండదు. ఒకోసారి మమ్మల్ని చూసి — ఫిట్సొచ్చి పడిపోతుంది, ఒకో దేవుడికీ

## లక్షలు

ఒకో వారం కేటాయించి—వారానికీ యేడు సార్లు ఒంటిపూట భోజనాలు చేస్తున్నాము. దీనికి తోడు మా నాయనమ్మ సాధింపు...'మీకింకా పెళ్ళిళ్ళు ఏంవిట్రా... గజ్జల గుర్రాల్లారా! మీ నాన్న ఓ పెద్ద మూట తెచ్చి మీకు పెళ్ళి చేస్తాడనుకుంటున్నారా? ఏ సాయిబ్బు నేనా ప్రేమించి లేవిపోండే!!' అంటూ వినరాని అనరాని మాటలు అంటూంది. బావా, నన్నీ పంజరం నుంచి, ఈ సాలెగూడు నుంచి ఎలాగేనా తప్పించు బావా! నాకు బుద్దెరిగిన దగ్గర్నుంచీ నిన్నే ఆరాధిస్తున్నాను. నీ తోడిదే నాలోకం అని భావిస్తున్నాను. నీకు మా కుటుంబం తెలుసు మా ఆర్థిక పరిస్థితులూ తెలును. నువ్వు — డబ్బుతోనే లోకం— అనుకునే మనిషివి కావు. నాకు తెలుసు. నన్నీ దారిద్ర్యం నుంచీ, ఈ కత్తుల కోటలోంచీ రక్షించు బావా. రక్షించు!

ని

నాగరత్నం,

—ఈ వుత్తరం మడిచి యింకో వుత్తరం తీశాను ఇది మా తమ్ముడు రాసింది.

'అన్నయ్యా,

అనేక నమస్కారములు. నన్నో పెద్ద డాక్టర్ని, చేయాలని మీరంతా ప్రయత్నించారు. అందుకు తగ్గట్టుగా నేనూ చదివి క్లాసు తెచ్చుకున్నాను. తెచ్చుకుంటే మాత్రం యేం ప్రయోజనం? సీట్లని డబ్బు పెట్టి కొనుక్కోలేని వాళ్ళం. చచ్చీ చెడీ బి. ఎస్సీలో సీటు సంపాదించుకున్నాము. దొరకగానే సరా, కొవాల్సిన పుస్తకాలూ— కట్టాల్సిన ఫీజలూ యివన్నీ చూస్తే — నాకు భయమేస్తోంది నువ్వు వుండే పరిస్థితులూ తెలుసు. నాన్నగారి ఆర్థిక పరిస్థితులూ నాకు తెలుసు. మిమ్మల్ని ఏ మొహం పెట్టుకొని మాటిమాటికీ డబ్బు పంపమని రాసేది? పోనీ— మీరు తిండి మానుకుని అయినా నాకు మిగిల్చి పంపుతారు ..మీ ఆకలి కడుపుల మీద— మీ నుదుటి చెమట మీద— నేను సంపాదించుకోబోయే ఆ డిగ్రీ నా కేం ఒరగబెడుతుంది? అది చేతపుచ్చుకొని కాళ్ళరిగేలా ఉద్యోగంకోసం తిరగడమేగా! తిరిగితే మాత్రం దొరుకుతుందా? ... అన్నయ్యా నాకీ చదువూ వద్దు. చట్టుబండలూ వద్దు. నాకేదైనా రాళ్ళు మోసే పనో బళ్ళు లాగే వుద్యోగమో చూడన్నయ్యా! నీతోపాటు నేనూ ఓ నాలుగు 'రాళ్ళు' సంపాదించి—ఇంతో అంతో మన కుటుంబానికి సాయపడ్తాను. ఇలా రాసినందుకు ఇంకోలా అనుకోకు. ఈ పరిస్థితిలో —ఇదే మంచిదేమో అనిపిస్తోంది...ఈ వుత్తరం అందగానే జవాబు రాయి.

ఇట్లు

శంకరం'

—ఈ వుత్తరం కూడా మడిచి జేబులో పెట్టుకున్నాను. ఇవి వుత్తరాలా? కావు. రెండు శూలాలు. కారంలో పొర్లించి కనుగుడ్లవేపు భయంకరంగా వస్తోన్న రెండు ఇనుప గునపాలు. గుండెల్ని పిండిచేసి ఆలోచనల్ని శూన్యమూ, అంధకారబంధురమూ చేసే రెండు నగ్నసత్యాలు. ఆశల పువ్వుల తోటలో కత్తుల వంతెనలు. ఆశయాల జీవన సంగీతంలో అగాధమయిన ఎలిజీలు. ఈ శూలాల్ని, ఈ గునపాల్ని, ఈ కత్తుల వంతెనల్ని, ఈ విషాద గీతాల్ని అంతం చెయ్యాలి. ఆదివారంనాడు పై అన్నింటికీ చరమగీతం పాడెయ్యాలి. ఇంకో అయిదు నిముషాల్లో బస్సు జెట్ స్పీడుతో బయల్దేరుతుంది. మరో అరగంటలో మింటులో దిగుతాను. మరొక్క పది నిముషాల్లో ముచ్చటగా మూడో రౌండు వేసుకుని—ఈవీ ఫెయిర్లో అసిజీగా వెయిట్ చేస్తున్న బ్రహ్మంగారి ముందుంటాను. ఇద్దరమూ కలిసి ఓ అరగంటసేపు డిస్కస్ చేసి అయిదు నెంబర్లు సెలెక్ట్ చేస్తాం. మరో ఇరవై నాలుగు గంటల్లో నా బేగ్‌లో లక్షలు నిండుతాయి ఇంపీరియల్లో డాన్స్ చూస్తూ డ్రైన్ చేస్తాం అప్పుడే జానీవాకరో అరిస్టోక్రాటో వేసుకుంటాం

వెంటనే ఆ రాత్రే — నాగరత్నానికో వుత్తరం, శంకరానికో వుత్తరం రాసి పడేస్తాను. నో. నో. టెలిగ్రాములు యిస్తాను. 'నో ఫియర్. మనీ హియర్' అని ...లక్షలు!

ఇప్పుడు నా దగ్గర ఫిఫ్టీ కాపర్సే వున్నాయి. అది వేరే విషయం. నేను రేపటి సంగతి చెబుతున్నాను. మనిషికి గతజల సేతుబంధనం వుండరాదు. ముందు చూపు

వుండాలి. ఇప్పుడు చేతిలో కొన్ని డబ్బు లేక పోవచ్చు రేపీపాటికి చేతులనిండా కనకమహాలక్ష్మి తాండవమాడదూ?

డియరెస్ట్ నాగరత్నం, డోన్ట్ వర్రీ. తొందరపడి ఏ సాయబ్బుతోనూ లేచిపోకు. నేనున్నాను. ఈ కుళ్ళు ప్రపంచానికి దూరంగా కొండల్లోంచి సురిగిసురిగి వాగులుగా మారే నీరంలో— ఓ బుల్లి పడవలో నీతో కూర్చుని ప్రేమయాత్ర చేయబోయే రోజు దగ్గర్లోనే వుంది. శైలసంఘాల దారుల్లో మబ్బుల మాలికల్లో మనం తేలియాడే రోజులు అనతిదూరమే సుమా! నీ చెక్కుటద్దాల అరుణిమని నేను పెదాలతో అద్దుకునేవేళ అత్యంత దూరం కానేకాదు. సాగరసమీప గుహాంతరాల్లో మన కేళీవిలాసాలూ, ఆలింగనలూ చుంబనాలూ ఫలించని కలలు ఎన్నడూ కావు! నాగరత్నం, వెయిట్ ఫర్ మీ!

తమ్ముడూ, నా చిట్టి తమ్ముడూ! వద్దురా నీ కంత నిరాశ! కొన్నాళ్ళు ఓపిక పట్టు. శ్రద్ధగా చదువు. రాజకీయాల్లోనూ, సాంసారిక సమస్యల్లోనూ బుర్ర పాడు చేసుకోకు. నువ్వు మాస్టర్ ఆఫ్ సైన్స్ అవాలి. నిన్ను ఫారిన్ పంపిస్తా. డబ్బుతో కావలసిన పని నీకేదున్నా, క్షణాల మీద జరిపించేస్తా. తొందరపడకు. చదువు మానెయ్యకు నువ్వు కలకాలం సుగంధం వెదజల్లే పువ్వుగా పరిణతి చెందాలి. ఇంత వేగిరం వాడిపోవద్దురా తమ్ముడూ, వాడిపోవద్దు!

నా పక్కనున్న గళ్ళ లుంగీవాడు కొంచెం కదిలేడు. దౌర్భాగ్యుడు. ఏరక్‌ని ఎన్ని సీసాలు ఖాళీ చేసేడో, గుడ్లగూబలా కళ్ళూ వీడూను! వున్నవాడు వూరుకోకుండా 'మణి ఎన్నాంగో?' అన్నాడు. వాచీ చూసి చెప్పాను.


సాయంకాలం ఆరు దాటింది. శీతాకాలం కాబట్టి త్వరగా పొద్దెక్కింది. అప్పుడే చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి.

గళ్ళ లుంగీవాడు మళ్ళీ నావేపు తిరిగేడు. 'ఎంగపోరింగే?' అన్నాడు బండగొంతుకతో. నే నెక్కడికెళ్తే వీడికేం? 'టంకసాల' అన్నాను ముక్తసరిగా. నాకు వాడితో మాటలు పెంచుకోవడం ఇష్టం లేదు. వాడి పక్కని కూర్చోవడమే పెద్ద చికాగ్గా వుంది. దానికితోడు మాటలు ఒకటా? కొంపదీసి వీడుకూడా మింట్‌దాకా వస్తాడు కాబోలు! దారి పొడుగునా సారాయి సువాసన భరించాల్సిందేనా?

డ్రయివరూ, కండక్టరూ ఇంత వేగిరం వచ్చేట్టు లేరు. బస్సుమాత్రం జనంతో కిటకిటలాడిపోతూంది. ఏం తోచక జేబులోంచి రేస్‌బుక్ తీశాను ఇది రేస్‌బుక్ కాదు, అశ్వమేధ యాగాతురులికి అనర్ఘమైన రత్నం.

రేపాదివారం జరగబోయే రేసుల్లో పాల్గొనే గుర్రాల వివరాలున్నాయందులో. ఫస్ట్ రేస్‌లో ఏవో నాలుగున్నాయి. అవంత ముఖ్యంకాదు. తర్వాత జరిగే అయిదు రేసులే నాకిప్పుడు కానఁసినవి. మొట్టమొదట పదకొండు గుర్రాలు పరుగెడుతున్నాయి. వాటిల్లో ఫస్ట్ లక్‌నిగానీ, జిప్సీ రోజ్‌నిగానీ సెలెక్ట్ చేసుకోవచ్చు. తర్వాత రేసులో మూన్‌రాక్ గ్యారంటీ విన్. మూడో రేసులో ఆరే గుర్రాలున్నాయి. ఆరింట్లో రెండు గుర్రాలు ప్రామిసింగ్‌గా కనిపిస్తున్నాయి. స్టార్ హెవెన్ గానీ, ఫ్లయింగ్ లోచిన్వార్‌గానీ విన్ చేయవచ్చు. స్టార్ హెవెన్ ప్రోగ్రెస్ రికార్డ్ చాలా హోప్‌ఫుల్‌గా వుంది. దాన్నే చూడాలి. నాల్గో రేస్ కొంచెం క్లిష్టంగా వుంటుంది. హేమాహేమీలైన పన్నెండు గుర్రాలున్నాయందులో. సుకియాకీ, గ్లేజ్‌డ్ రిబ్బన్, సమ్మర్ వైన్, కోహిమా— అన్నీ ప్రామిసింగ్‌గనే కన్పిస్తున్నాయి. సమ్మర్ వైన్‌మీద ఓ కాంబినేషనూ— సుకియాకీమీద ఓ కాంబినేషనూ తీసుకోవచ్చు. తర్వాత దాంట్లో బ్లాజన్‌షవర్ విన్ చేసి తీర్తుంది. బ్లాజన్‌షవర్ కాక రాయల్‌షూట్ కూడా వుంది ఇందులో. డర్టీ రాయల్ షూట్‌ని నమ్మకూడదు. దీన్ని నమ్మేకాదూ, గతసారి నేను రెండొందలు పోగొట్టుకున్నదీ! లేకపోతే అంత దూరమూ బాగానే పరుగెత్తి రీచింగ్‌పాయింటుదగ్గర 'కిస్‌మి డార్లింగ్'తో ఓడిపోవడమా? అదీ— ఫోటోఫినిష్‌తో!... బ్రహ్మంగారుకూడా బహుశా నాలాగే ఆలోచిస్తూండి వుంటారు.

డ్రయివర్ ఎప్పుడొచ్చేడో యేమిటో బస్సు బర్రుమని స్టార్టు అయింది. రాకెట్‌లాగా ముందుకి దూసుకుపోయింది. నలభై అయిదు పైసలిచ్చి మింట్‌కి టికెట్టు తీసుకున్నాను. నా పక్కనున్నవాడు వాల్టాక్స్ రోడ్‌దాకా టికెట్టు తీసుకున్నాడు. టికెట్టుని పది మడతలుచేసి చెవిమీద దోపుకున్నాడు. వెధవస్తాయిలు. నేను నా చేతిలోవున్న పుస్తకాన్ని తెరిచి చూడసాగేను. చూస్తున్నానేగాని నాకేం కన్పిస్తున్నాయి? అక్షరాలా, కానే కాదు, గిండీ రేస్‌కోర్స్ ఎంక్లోజర్‌లో తీర్థప్రజలా జనం, ఫీల్డులో గేలప్‌చేసే గుర్రాలు, పువ్వుల తోటలో కత్తులబాటమీద నడవలేని నాగరత్నం, వాడబోయే గులాబీలాంటి నా తమ్ముడు శంకరం, విన్నప్‌రాశీ, స్వీట్ రిప్సీ, సెక్సీ సబీనా, అరిస్టోక్రాట్ ద్రవపు రంగూ,



వాలుగా రాండు అయిపోయి మెడ వంచేసిన బ్రహ్మం...ఈ బొమ్మలు ఒకదాని మీద ఒకటి–నా కెదురుగా వున్న పుస్తకం మీద సూపరింపోజ్ అవుతూ కన్పిస్తున్నాయి.

కోయిల్ దగ్గర బస్సాగింది ఒకరో ఇద్దరో ఎక్కేరో లేదోగాని కండక్టరు కుయ్యిమని విజిల్ వేశాడు. డ్రయివర్ రయ్యిన బస్సు పోనిచ్చేడు. బస్సులో సూది మొన మోపేందుక్కూడా చోటులేదు. జనంతో కిటకిటలాడిపోతూంది. ఎదురుగుండా సీట్లోని నవదంపతులు వాళ్ళ బాధలో వాళ్ళున్నారు. గావ్స్ థియేటర్ స్టేజి దగ్గర బస్సు ఆపకుండానే పోనిచ్చాడు కండక్టరు. కాసింత దూరం పోయేక స్టేజి కాని చోట బస్సాపేడు. ఇక్కడ అందరికీ టిక్కెట్లు ఇచ్చిం తర వాతగానీ, బస్సు 'బయల్దేరదన్న మాట!

అయిదు నిమషాలు గడిచేయి ఇంతలో నా కుడిపాదం మీద ఏదో పడినట్లు బరువుగా అన్పించింది. ఏమిటా అని కొంచెం వంగి చూశాను. ఉబ్బెత్తుగా వున్న ఓ అందమైన మనీపర్సు! యాదాలాపంగా చూసినట్లు చుట్టూ చూశాను. అందరూ ఎవరి గొడవలో వాళ్లు వున్నారు. మెల్లిగా బూటు కాలిని దానిమీద వేశాను. ఆ వెయ్యడం ఎంత అప్రయత్నంగా వేశానో నాకే తెలేదు. ఆ పర్సు నాది కాదు. దానిమీద నాకెంత మాత్రం హక్కులేదు. నేను



చేస్తున్నది దొంగతనం అని వేరే ఎవరూ చెప్పక్కర్లేదు. కాని, చెయ్యాలనిపించింది. చేస్తేనే తప్ప వేరు మార్గం లేదు. రేపొద్ది వారం రేసులికి వెళ్లాలంటే డబ్బులేదు. నాకోసం నా అదృష్టదేవత ఈ రూపంలో వచ్చిందేమో...ఏమో! హూ నోస్?

కండక్టర్ వెనక నుంచి 'రైట్–రైట్' అని అరిచేడు. మళ్లీ ముందుకి సాగింది బస్సు... నా ఆలోచనలు పరిపరి విధాల పోసాగినై. పర్సులో కనీసం రెండు వంద లేనా వుండి వుంటాయి. రేపు రేసుల్లో ఇరవై జాక్‌పాట్ టికెట్లు కొనొచ్చు. ఇరవైలోనూ కనీసం ఒక్కటైనా పేలకదా? ఏ ఒక్కటి పలికినా లక్షలు – రెండుసార్లు కేరీఓవర్ అయిన జాక్‌పాట్ పూల్ కొట్టి తీరుతాను. గ్యారంటీ తప్పదు!

నా పక్కనున్న గళ్ళలుంగీవాడు నావేపు ఓసారి చూసి మళ్ళీ అటువేపు మొహం తిప్పుకున్నాడు. రౌడీ రాస్కెల్. కేడీ నంబర్ వన్‌లా వున్నాడు. పవర్‌హౌస్ స్టేజి దగ్గర బస్సు ఆగింది. మళ్ళీ బస్సు బయల్దేరేంతలో ఎవరో బస్సులో వున్నవాడు 'హోల్డాన్ హోల్డాన్' అంటూ కేకలేశాడు. దాంతో ఠక్కున బస్సాగింది బస్సు ముందు భాగంలో నిలబడ్డ సర్దార్జీ ... క్రుర్రాడే, 'కోయీ మేరా పాకెట్ మార్‌దియా' అని హిందీలోనూ–'సంబడీ స్టోల్ మై పర్స్'అని ఇంగ్లీషులోనూ సంధిపేలాపన మొదలెట్టాడు.


పక్కనే నిలబడ్డ ఓ సూట్‌వాలా గొడవలో జోక్యం కలగజేసుకున్నాడు. సర్దార్‌జీని ప్రశ్న మీద ప్రశ్న వేసాడు. అతనిచ్చిన జవాబుల్ని బట్టి తెలిందిది:

అతను ఢిల్లీనుండి దక్షిణదేశ యాత్రకి వచ్చాడు. రైల్వేలో పని చేస్తున్నాడు. సరాసరి ఢిల్లీ నుంచి మద్రాసులో మొదటి సారి దిగేడు. ఏమైనా షూటింగ్‌లు చూద్దామని స్టుడియోలమీద పడ్డాడు. పర్సులో అయిదువందలవరకూ వుంది. అదీ సంగతి!

'ఈ బస్సులోనే పోయిందా–వేరే ఎక్కడేనా పోగొట్టుకున్నారా' అని వాకబు చేశాడు సూటువాలా.

సర్దార్జీకి ముచ్చెమటలు పోస్తున్నాయి. గొంతుక తడారి పోయింది గాబోలు నోటంట మాట వెంటనే రాలేదు. బస్సు వెనకభాగంలో వున్న ఆడవాళ్ల సీట్లకేసి వుండుండి చూస్తున్నాడు. అక్కడ సల్వార్, కమీజ్ వేసుకున్న యువతి సర్దార్జీని ఆందోళనగా చూస్తోంది ఆమె పక్కనే అయిదేళ్లపాప, ఏడాది అబ్బాయి వళ్లోనూ వున్నారు. అతని భార్యాపిల్లలూ కాబోలు... రుమాలుతో ముఖం తుడుచుకుని తను నిలబడ్డచోటనే కింద వెతికాడు...ఎక్కడ పోయిందో గుర్తుకి తెచ్చుకోడానికి ప్రయత్నించేడు సంగతి తెలుసుకున్న డ్రయివరూ, కండక్టరూ పర్సు ఎవరికైనా దొరికితే యిచ్చెయ్యమంటున్నారు. బస్సులోని జనం రకరకాల వూహాగానాలూ, కథలూ ప్రారంభించేరు. నేను మాత్రం నిర్వికారంగా నిశ్చలంగా అటు చూస్తున్నాను. దాదాపు అయిదు వందలున్న ఆ మనీపర్సు నా కాళ్లదగ్గిర భద్రంగానే వుంది. ఆ పంజాబీ యువకుడికేసి చూశాను. ఆత్రుతతో భయంతో – సందేహాస్పదంగా అందర్నీ చూస్తున్నాడు.

సూటువాలా మళ్లీ ఇంటరాగేషన్ ప్రారంభించేడు. సర్దార్జీ బస్సెక్కే ముందు పర్సు వుందో లేదో చూసుకోలేదన్నాడు. అయితే అది అంతకుముందే ఎవరో కొట్టెయ్యడంగానీ, పోవడంగానీ జరిగి వుండాలని సూటువాలా తీర్మానించేశాడు. సూటువాలాకి మనస్సులోనే థాంక్స్ చెప్పాను. ఇక్కడ బస్సు వెంటనే దిగిపోయి–ఇంతకు



ముందు ఏక్కడెక్కడ తిరిగేరో— అక్కడ పర్సుకోసం వెతకమనీ, ఒకవేళ దొరక్కపోతే దగ్గర్లో వున్న పోలీసుస్టేషన్లో రిపోర్ట్ ఇవ్వమనీ మాటువాలా ఓ సలహా యిచ్చిపారేశాడు.

సర్దార్జీ కాసేపు ఆలోచించేడు. భార్య వేపు చూసి పంజాబీలో యేదో అన్నాడు. పిల్లాడిని ఓ చేత్తో ఎత్తుకుని, మరో చేత్తో పాప భుజంమీద చెయ్యివేసి నిలబడింది. సర్దార్జీ గెడ్డం సవరించుకుంటూ ఇంగ్లీషులో చిన్న ప్రసంగం చేసేడు. మాటువాలా దాన్ని ముందు తమిళంలోకీ, తర్వాత తెలుగులోకీ అనువదించేడు. దాని సారాంశం ఇది.

'అయ్యలారా! నేను ఇక్కడో ఇంకెక్కడో మొత్తానికి పర్సు పోగొట్టుకున్నాను. దాంట్లో దాదాపు అయిదువందల రూపాయిలున్నాయి. డబ్బు పోయినందుకు అంత విచారంలేదు. కాని ఆ పర్సులో నా రైల్వే పాసుంది. అదిగాక గతించిన నా తల్లిగారి ఒకేఒక్క ఫోటోవుంది. ఈ రెండూ నాకు అతి ముఖ్యమైనవి. ఒకవేళ పర్సు ఎవరికైనా దొరికితే—పాసూ, ఫోటో ఈ రెండూ నాకు పోస్టులో పంపినా చాలు. నేను సెంట్రల్‌స్టేషన్ దగ్గర ఎవరెస్టు లాడ్జిలో భార్యాసమేతంగా బసచేసివున్నాను. నేనింకో నాలుగురోజుల వరకూ అక్కడే వుంటాను. శలవు!'

—అనేసి అందరి వంకా ఓసారి ప్రార్థనాపూర్వకంగా చూసి బస్సు దిగేడు. వెనకే అతని భార్యా పిల్లలూ దిగారు. ఈ పంజాబీ ఆవిడ యెవరో గాని ఘటికురాల్లాగే వుంది. భర్త డబ్బు పోగొట్టుకున్నాడని తెలిశాక కూడా ఎంత నిబ్బరంగా బస్సు దిగింది! ఇదే మనవాళ్ళయితేనా, ఎవరో కాలంచేసినట్టు రాగాలాపన చేసేవాళ్ళు. ఏలా అయినా పంజాబీ గరల్స్ ఆర్ బ్రేవ్ గరల్స్!

మళ్ళీ బస్సు బయలుదేరింది. మనస్సులో అనేక ఆలోచనలు. కంగారు ప్రారంభమయింది. కాళ్ళ దగ్గర వున్న మనీపర్సు చేతుల్లోకి తీసుకోవడం యెలా? ఆ పంజాబీ దంపతులు డబ్బుల్లేకుండా మళ్ళీ ఢిల్లీ యెలా చేరుకుంటారో పాపం! పాపమేమిటి, ఆ అమ్మాయి మెడలో బంగారం నెక్లేస్ వుందిగా. అమ్ముకుంటే యెంత లేదన్నా ఓ నాలుగొందలు వస్తాయి. దర్జాగా వెళ్తారు ఢిల్లీకి.

అంతలో చటుక్కున మెరుపులాంటి అయిడియా వచ్చింది. చేతిలోవున్న పుస్తకం మూసేసి వళ్ళో పెట్టుకున్నాను...ట్రిప్లికేన్ పురం స్టేజి దగ్గర పెద్ద కుదుపుతో బస్సాగింది. పాదాల దగ్గర పడేట్టు పుస్తం జార్చేసు. వంగి పుస్తకం తీస్తున్నట్టు నటిస్తూ—పర్సుని పుస్తకం మధ్యలో ఇరికించేను. గుండెలు ఒక్కసారి...కొద్దిసేపే దడదడమన్నాయి.

అప్ః...హయ్య!

గుండెల్లోంచి పదివేల టన్నుల బరువు ఒక్కసారి దిగినంత హాయిగావుంది. పక్కనున్న గళ్ళ లుంగీవాడు తల నాకేసి తిప్పేడు. కొన్ని క్షణాలు నాకేసి తీక్షణంగా చూశాడు. అంటే నా రోమర్‌వాచీనీ, నా బ్లాక్ కలర్ టెర్లిన్ స్లాక్‌నీ, గ్రే కలర్ టెర్లిన్ పాంటునీ పరీక్షగా చూశాడు. డర్టీ రోగ్. దొంగ వెధవ. ఏమిటా పరీక్ష ?!

లిబర్టీ స్టాప్ దగ్గర బస్సాగి మళ్ళీ బయల్దేరింది. కోడంబాకం బ్రిడ్జి మీంచి జంయ్‌మంటూ దూసుకుపోతూంది. నా



ఒళ్ళు ఎక్సయిట్‌మెంట్‌తో తేలికయి పోతూంది. కాళ్ళు తిమ్మిరెక్కినట్టు మొద్దు బారిపోయేయి. బస్సు కోడంబాకం బ్రిడ్జి దాటింది.

నాగరత్నం, డోంట్ వర్రీ!

శంకరం, నో ఫియర్?

ఫస్టు లవ్, కమ్ కమ్!

మూన్‌రాక్, కమాన్ బేబీ కమాన్!

స్టార్‌హెవెన్, రారా బాబూ రా!

సమ్మర్‌వైన్, గేలప్—గేలప్!

బ్లాజమ్ షవర్, అప్‌రె బేటా అప్!

మిస్టర్ పాపారావ్ ఆఫ్ విజయవాడా, వన్ ది జాక్‌పాట్. రూపీస్ ఫయివ్ లేక్స్, ఎయిటీనైన్ థౌజండ్, వన్ హండ్రడెండ్ థర్టీ నైన్ పాయింట్ ఫిఫ్టీ పైసే!!!

'టాక్సీ.'

'సార్.'

'ఎగ్మూర్. హోటల్ ఇంపీరియల్!'

...............

'బేరర్, తాండూరీ చికెన్. కేష్యూ నెట్స్. స్పెన్సర్ సోడా టూ బాటిల్స్. దట్సినఫ్ ఫర్ ది ప్రెజంట్!'

'డియర్ పాపారావ్, ఓపెనప్ ద బాటిల్!'

'ఏస్.'

'ట్...ష్‌ష్‌క్క్!'

'కమాన్ మధూ, సింగ్ మీ ఏ సాంగ్ ..ఏ స్వీట్ సెక్సీ సాంగ్!'

## లక్షలు

'ఛీరప్ సెబీనా, సెక్సీ సబీనా! స్వే యువర్ హిప్స్ ఇనే జెట్ స్పీడ్. ఓ—నో! స్టీల్ స్పీడ్...య్హా...య్హా...దట్స్ గుడ్!'

'వేరెజ్ రాఖీ? మై డార్లింగ్ డాన్సర్ ...బక్సమ్ బ్యూటీ రాఖీ...వేరీజ్ షీ?!'

బస్సు ఓసారి ఆగింది.

మళ్ళీ బయల్దేరింది.

నా ఒళ్ళంతా మైకంలో వున్నట్టుంది.

ఈ వెధవ బస్సులో మరింక ముందుకి పోలేను ... ఇక్కడ ఎక్కడేనా దిగిపోయి, టాక్సీలో పోవడం బెస్టు! టాంక్‌రోడ్ మొదట్లో బస్సాగింది. గబుక్కున లేచి బస్సు దిగిపోయేను. దూరంగా గుడిసెల్దగ్గర 'పబ్లిక్ న్యూసెన్స్' చేసే ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు రంగు తెలీని చీరల్లో వున్నారు. అల్లంత దూరాన పీకలదాకా తాగిన వాడొకడు కుళ్ళుకాలవ పక్క పడుకుని అర్థం కాని భాషలో ఏదో పాడుకుంటున్నాడు. నేను దిగిన బస్సు ముందుకి సాగిపోయింది...ఆ ప్రదేశం దాదాపు నిర్మానుష్యంగానే వుంది. అంతలో వెనక అడుగుల చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడి వెనక్కు తిరిగాను.

గళ్ళలుంగీవాడు!

నా గుండె గుభేలు మంది. రాస్కెల్. వాటా కోసం వచ్చేడు కాబోలు! నేను ఎంతో శ్రమపడి, రిస్కు తీసుకుంటే — దొరగారిలా వాటా కోసం వచ్చాడు! బాస్టర్డ్!!

వాడు దగ్గరగా వచ్చి నా ఫిల్టు పట్టుకున్నాడు. నేను మాట్లాడలేదు.

'ఏంటిటి నీపేరు?' అన్నాడు.

చెప్పేను. చెప్పి, ఫిల్టు మర్యాదగా ఒదల్లమన్నాను.

వెధవ, వదల్లేదు.

ఎడంచేత్తో ఫిల్టు అలాగే పట్టుకుని, కుడిచేతిని చాచేడు. 'ఏదీ ఆ పర్స్ ఇలాగియ్!! అన్నాడు.

'ఏమిటీ దౌర్జన్యం?' అన్నాను హీన స్వరంతో.

'ఇస్తావా? నా లుగు తగిలించమన్నావా?'

ఇచ్చాను. ఫిల్టు వదిలేడు. పర్సు జిప్ లాగి, ఫోటో — ఆకుపచ్చని కాగితం తీసి తన బనీను జేబులో దాచుకున్నాడు. మళ్లీ పర్సు మూసేసి—నా వైపుచూసేడు.

'తెలుగువాడివై పోయేవు గనక బతికి పోయేవు. లేకపోతే చావదన్నేవాడిని. అయినా నీకిదేం బుద్ధి? తిండికి లేకపోతే రిక్షా తొక్కు. లేకపోతే ముష్టెత్తు. అదీ చేతగాకపోతే ఉరిపోసుకుని చావు!' అన్నాడు.

అని, ఆ పర్సుని గురిచూసి, నా ముఖం మీదికి — అక్షరాలా నా ముఖం మీదికి విసిరి కొట్టేసి — గబగబ పెద్ద అడుగుల్తో వెళ్ళిపోయాడు...ఆ గళ్ళ లుంగీవాడు!

నా కొక్కసారి కళ్ళముందు పెద్ద మెరుపు మెరిసినట్టూ నెత్తిమీత పిడుగు పడినట్టూ అయింది.

నెమ్మదిగా వంగి గొంతుకూర్చున్నాను. ఒణుకుతున్న చేతుల్తో నేలమీద పడ్డ పర్సుని — అయిదు వందల రూపాయిలు తన కడుపులో దాచుకునివున్న పర్సుని అందుకున్నాను. దానివంక ఓ నిమషంపాటు దీక్షగా చూశాను.

గుండెల్లో అంతవరకూ అణగివున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది. రంపపు కోతని భరించలేనివాడిలా మోకాళ్ళమధ్య తల పెట్టేసుకుని, గట్టిగా భోరుమని ఏడ్చాను. గుండెబరువు తీరేవరకూ అక్కడే కూర్చొని, అలా ఎంతసేపు ఏడ్చానో నాకే తెలీదు!

